


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఇంతేరా ఈ జీవితం....

**చిన్నప్పుడు ఎవరింట్లో** అయినా జొన్న అన్నం తింటున్నా, గోధుమ అన్నం తింటున్నా.. అయ్యో పాపం అనుకునేవాళ్ళం. అదేవిటో ఖర్మ.. కాలమహిమ వల్ల ఎవరింట్లో మాములు సన్నబియ్యం తింటున్నా, పాలిష్డ్ రైస్ తింటున్నా "వీళ్ళకి ప్రాణాల మీద తీపి లేదా?" అన్నట్లు చూస్తున్నారు. కొర్రలు, జొన్నలు, రాగులు వీటితో సంకటి చేసి హోటల్స్ వాళ్ళు 'ఇదే సందు అదే సందు' అని ఫైవ్ స్టార్ రేట్స్‌తో అమ్మేస్తున్నారు. ఇంక 'సలాడ్స్' కోసం సెపరేట్ రెస్టారెంట్స్ పెట్టి, నాలుగు పచ్చి ఆకులూ, రెండు బేబీ టొమేటాలూ, సన్నగా తరిగిన బెంగుళూరు మిర్చీ, కేరట్, కీరా ముక్కలూ ప్లేట్లో పెట్టి వందలకి వందలు వసూలు చేస్తున్నారు. ఈ తిండి నేను ఇంట్లో పెట్టి "ఇదిగో ఈ సూప్ తాగి పచ్చి కూరలు తినండి.. ఈ పూటకి ఇంతే!" అంటే ఇంట్లో వాళ్ళు వింటారుటండీ?

నిన్న స్నేహితురాలి కూతురి శీమంతానికి వెళ్ళానా! అక్కడా ఈ రాగి సంకట్ల, దంపుడు బియ్యపు అన్నం తయ్యారు. చిన్నప్పుడు ఈ ఎర్రటి అన్నం తింటున్న పనివాళ్ళని చూసి జాలిపడేదాన్ని. ఇప్పుడు వాళ్ళు మనని చూసి జాలిపడ్తున్నారు.

మా డ్రైవర్ కుమార్‌కి తారీకూ సంవత్సరాలతో సహా ఎవరింట్లో ఏం తిన్నాడో.. బియ్యం ఎలాంటివి వండి పెట్టారో గుర్తు వుంటుంది.

"మనం 'అందరి బంధువయ్యా' సెట్టింగ్‌కి వెళ్ళినప్పుడు చంద్రసిద్దార్థ సార్ ఆఫీస్‌లో ఒక ఎడ్డాయన వంట చేసేటోడు చూడు. ఆ దినం భలే రైస్ పెట్టిండు మేడం.. మళ్ళీ ఎక్కడా ఆ రైస్ తినలే" అంటాడు.

ఎంతటి వీ.ఐ.పీ ఇంట్లో పెళ్ళికి వెళ్ళినా, బయటకొచ్చి "రైస్ బాగాలేదు" అని తీసి పారేస్తాడు.

వీడిని అసలు రైస్‌కి సంబంధించిన ఏ శాఖలో అయినా క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్‌గా వెయ్యచ్చు. నాకైతే వీడింటికి రహస్యంగా వెళ్ళి వీడి భార్య ఎలాంటి తిండి పెడ్తోందో, చూసి రావాలని వుంటుంది. వీడు వంక పెట్టని స్టార్ హోటల్స్ కూడా లేవు. అసలు వీడి దృష్టి తిండి మీద తప్ప ఇంకో దాని మీద వుండదు జీవితంలో.

వీడినేకాదు నేను లైఫ్‌లో చాలామందిని చూసాను. వారికి జీవితంలో తిండిని మించిన ప్రయారిటీ ఇంకోటి వుండదు. అప్పటిదాకా గాంధీగారి ట్విన్ బ్రదర్‌లా శాంతంగా వున్న వీళ్ళు తిండి దగ్గర కూర్చుని అపర పరశురాముడులై అవతల వారి ప్రాణాలు తీయాలన్నంత ఆగ్రహం వ్యక్తం చెయ్యడం చూసాను.

"ఇదేం(టా? ఇది రైసా?.. నీ బొంద.. తీసుకెళ్ళి అవతల పారెయ్. .. ఈ కూరేంటి ఇలా ఉప్పూ కారం లేకుండా తగలడింది? ఈ పచ్చడేంటి గొడ్డు కారం? నన్ను చంపేద్దామనేనా?" అని కారాలూ మిరియాలూ నూరేవారు కొందరైతే, అన్నం పళ్ళెం తీసి విసిరేసి నిప్పులు కక్కుతూ వెళ్ళిపోయే వారు మరి కొందరు.

మా సినిమా ఫీల్డులోనే కాస్ట్లీ హోటల్‌నుండి తెప్పించిన ఫుడ్ మొత్తం, డస్ట్‌బిన్‌లో పారేయించిన ఓ డైరెక్టర్‌ని (అందరూ స్టార్ హీరోస్‌తో వరుసగా ఫ్లాప్స్ ఇచ్చిన డైరెక్టర్) చూసి విస్తుపోయాను. వీళ్ళు ఇంటికెళ్ళి ఒకే కూరతో, ఎలావున్నా నోరు మూసుకుని తినడం కూడా చూసాను.

మా దగ్గర ఓ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ వున్నారు. ఆయన మనం తినేవాటి గురించి దేని గురించి మాట్లాడినా.. "అబ్బే తిండి అంటే మా ఊరేనండీ... మా ఊళ్ళో వున్నట్లు ఎక్కడా వుండదు" అని మొదలు పెడ్తాడు.

ఒకరోజు మేం అందరం ఇరానీ చాయ్ గురించి మాట్లాడుకుంటున్నాం. "ఇరానీ చాయ్ అంటే స్టేషన్ దగ్గర ఆల్ఫా హోటల్‌లోనే తాగాలి" అని ఒకరు అన్నారు. "అబ్బే.. ఫ్రీ ఇండియా కేఫ్ అని ఆర్.టీ.సీ క్రాస్ రోడ్స్‌లో వుండేది. అదీ టీ అంటే" అని ఇంకొకరు అన్నారు.

మా ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ వెంటనే "అబ్బే అదికాదు టీ అంటే మా నెల్లూరులో బస్ డిపో దగ్గర సెంటర్లో వుండే ఫలానా హోటల్‌లో తాగాలి." అని చెప్పడం మొదలెట్టాడు.

"1975 ఆ ప్రాంతాలలో నేను ఉద్యోగం చేసే రోజుల్లో సెకండ్ సాటర్‌డే, సన్‌డేల కోసం ఎదురు చూసేవాడిని. ఒకసారి అలాగే శనివారం బస్ డిపోకెళ్ళాను. ఆల్‌రెడీ రిజర్వేషన్ అయిన సీటు, ఎక్కి ఎయిర్ బ్యాగ్ పైన పెట్టి, రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాను. టైం పాస్‌కి కమలా పండ్లు కొనుక్కున్నాను. పక్క ఆయనతో సినిమాల గురించి పిచ్చాపాటి మాట్లాడ్తూ అలాగే నిద్రపోయాను. మెలుకువ వచ్చేసరికి ఒంగోలు. దిగి ఓ సోడా తాగాను. బొప్పాయి పండ్లు అమ్ముతున్నారు. నాన్నగారికి మంచివని కొనుక్కున్నాను. మళ్ళీ బస్ ఎక్కాను. నా పక్కనాయన లేచేవున్నాడు జంతికలు లాంటివేవో తింటున్నాడు. నాకూ ఇచ్చాడు. నా దగ్గరున్న బిస్కెట్స్ ఆయనకి ఇచ్చాను. మళ్ళీ పిచ్చాపాటీ మాట్లాడ్తూ మహమ్మద్ రఫీ గొప్పవాడా, కిషోర్ కుమారా? అని ఆ పాటల్లోకి వెళ్ళిపోయాం. ఇద్దరికీ సినిమాలంటే ఇంట్రెస్ట్ కదా. బిట్రగుంట కూడా దాటింది. నాకు చాలా తలనెప్పొచ్చింది. ఆయన ఇంకా నిద్రపోతున్నాడు. నేను నిద్ర నటించా. పాపం అయినా నా నుండి రెస్పాన్స్ రాక నిద్రపోయాడు. నిద్రలేచి ఓ అరగంట ధ్యానంలో కూర్చున్నా. మా ఊరొచ్చింది. దిగి రిక్షా పిలిచా..."

అందరం 'టీ' అనే అసలు టాపిక్ దగ్గరకి వచ్చేసాం అని వుత్సాహంగా ముందుకి ఒంగాం. "రిక్షా వాళ్ళందరికీ మా ఇల్లు తెలుసు. నన్ను గుర్తుపడ్తారు. సరదాగా కబుర్లాడుతూ సెంటర్ దాకా వచ్చాం. అక్కడ రిక్షా ఆపి నేను ఓ గ్లాసు పాలు తాగా. రిక్షావాడు టీ తాగాడు" అన్నాడు.

అంతా ఉలిక్కిపడ్డాం. అదేవిటీ ఇంత సొల్లు విన్నదీ 'టీ' గొప్పదనం చెప్తాడని కదా... అని.

"తాగి తిన్నగా ఇంటికి పోయాం" అని ముగించాడు. "అదేవిటి మాష్టారూ.. టీ తాగితే ఆ సెంటర్లోనే తాగాలన్నారు కదా?" అని అడిగేసాం.

"ఆ.. టీ గురించా నేనిదంతా చెప్పింది." అని ఆలోచనలో పడ్డాడు. అసలు సంగతి అతను దేని గురించి మొదలు పెట్టాడో టాపిక్ మర్చిపోయాడు. చాలామంది ఉత్సాహంగా మొదలు పెట్టి చాంతాడు భాగోతం చెప్పి, ఏం చెప్పాలనుకున్నారో అది మర్చిపోతారు పాపం.

టీ పెట్టడం కాఫీ పెట్టడం కూడా నిజానికి ఒక కళ. కొందరిళ్ళలో కాఫీ తాగితే ఇంక జన్మలో మళ్ళీ కాఫీ మాట ఎత్తం. కొందరి చేతి టీ అయితే చక్కెర పాకమే. మా బంధువుల్లో ఒకావిడ "హార్లిక్స్ తాగెళ్ళండి పిన్నీ... హార్లిక్స్ తాగి వెళ్ళండి" అని తెగ మొహమాట

పెట్టేది. మనం ఖర్మకాలి సరే అన్నామా ఓ చెంచా పొడీ, నాలుగు గ్లాసులు వేడినీళ్ళూ వేసి మా ఇంటిల్లిపాదికీ హార్లిక్స్ కలిపి ఇచ్చేది. ఓ చెంచా పంచదార కూడా వేసేది పాపం. ఆవిడకి పిసినారితనమో, కలపడం రాదో.. ఇప్పటిదాకా నాకు అర్థం కాలేదు.

మేం అమీర్‌పేట్‌లో ఒకింట్లో అద్దెకున్నప్పుడు ఇంటావిడకి ఉప్మా చెయ్యడం నేర్పించాలని తెగ ప్రయత్నించా. ఆవిడ నూనె కానీ నెయ్యి కానీ చెమ్చా కూడా వెయ్యలేదు. అందుకని అది 'లై' పిండిలా తయ్యారయి కేవలం గోడలకి పోస్టర్లు అతికించడానికే పనికి వచ్చేది. "మీరు చెప్పినట్లే చేసానండీ... ఎందుకో కుదరలేదు" అనేది ఆవిడ.

వెనుకటికి మా అన్నయ్య ఒకరింట్లో ఇంటావిడ బెండకాయకూర వడ్డించగానే, తిని "పిన్నిగారూ పొయ్యి మీద కూడా పెట్టాలేమోగా?" అన్నాడు.

ఇంకోసారి మా వదిన జంతికలు చేస్తే ఎందుకో గట్టిగా అయ్యాయి. నేను వూరుకోకుండా "పాళ్ళు ఎలా వేసావ్?" అని అడిగాను.

"మూడు బియ్యం... ఒకటి రాళ్ళూ." అని మా అన్నయ్య చెప్పాడు. మా వదినకి కోపం వచ్చింది.

మావారు పెళ్ళైన కొత్తల్లో "ఇదేం కూర?" అని అడిగితే

"నేను వంకాయ మెంతికూర" అని చెపితే...

"ఓ దానికి ఆ పేరు పెట్టావా?" అన్నారు. నిజం మాట్లాడితే అప్పటికి నా వంట అలాగే ఏడ్చింది లెండి. ఓసారి ఈయన స్నేహితుడొచ్చాడని చపాతీలు చేస్తే, అతను మొహమాటం లేకుండా "మన టెన్నిస్ బ్యాట్స్ ఇంకా మెత్తగా వుంటాయి కదరా" అన్నాడు.

చిన్నప్పుడు మా కాలనీలో ఒకావిడ శ్రావణ శుక్రవారంనాడు అమ్మని భోజనానికి పిలిచింది. నేనూ వెళ్ళాను. మూడు దాటింది. కడుపులో ఆకలి మండిపోతోంది. ఏవో నల్లని మాడు పెచ్చులు నాలుగు విస్తట్లో వడ్డించింది. పక్కన పులిహోరా, అన్నం, కూరలూ, ఆనవాలు తెలిసాయి. ఈ పెచ్చు నేను తినిచూసి "అమ్మా తియ్యగా వుందే కానీ అర్థం కావట్లేదు" అన్నా. ఆవిడ విని "అదేవిటే బాదూషాలు ఎన్నడూ తినలేదా?" అంది. ఆ నల్లని మూడు పెచ్చులకి 'బాదూషా' అని ఆవిడ పేరు పెట్టుకుందిట.

అన్నం దగ్గర కూర్చుని మాట్లాడినా, పదార్థాలకి పేర్లు పెట్టినా మా అమ్మమ్మకి నచ్చేదికాదు. "చప్పున తిని లేచి చదువుకోవాలి" అనేది.

"అమ్మమ్మా పప్పు పులుసులో బెల్లం వేస్తే నేను తినను" అనేవాడు మా రాము అన్నయ్య.

"అడుగున బెల్లం వేసారా. పైన నువ్వు వేస్కో" అనేది అమ్మమ్మ. వాడు నమ్మి అలాగే చేసేవాడు.

"అమ్మమ్మా ఉల్లిపాయ వెయ్యద్దు కాకరకాయ వేపుడులో" అని నేను అంటే, "అబ్బే అది ఉల్లిపాయ కాదు, కాకరకాయ్.. అదేవిటో అసలు చేదు లేదమ్మా ఈ పూట" అనేది.

నేను నోర్మూసుకుని తినేసేదాన్ని. చిలకడ దుంపలు పచ్చడి చేసి కొబ్బరి పచ్చడి అని నమ్మించేది.

నా పిల్లలు కూడా ఎన్నడూ తిండి దగ్గర పేచీలు పెట్టింది లేదు. అన్ని కూరగాయలూ తినడం అలవాటు చేసాను.

మా అబ్బాయి స్నేహితుడొకడున్నారు. వాడింటికి వెళ్ళాం. పెద్దాడు వంకాయ, టమాట, కాకరకాయ, సొరకాయ, పొట్లకాయ, కొత్తిమీర తినడట. చిన్నాడు కొత్తిమీర, కరివేపాకు, ఆలూ, దొండ, బీర, పొట్ల తినడుట. భర్త ఏ ఆకుకూరా తినడుట. ఆవిడ రోజుకి మూడు రకాల కూరలూ, రెండు రకాల పులుసులూ చేస్తుందిట. బావుందా?

ఇంక పిల్లలకి చిన్నప్పుడు కొందరు అన్నింట్లో పంచదార వేసి అలవాటు చేస్తారు. ఉప్మాలో పంచదార, దోశలో పంచదార, ఇడ్లీలో పంచదార, బ్రెడ్‌లో, చపాతీలో, పూరీలో, పెరుగన్నంలో కూడా.

అది ఫరవాలేదు. ఇంకా కొందరు విచిత్రమైన అలవాట్లు చేస్తారు. కూరల్లో వుప్పు వెయ్యగానే తీసేస్తారు. కారం జల్లక ముందే దించేస్తారు. వీళ్ళు ఎంత పెద్దయినా పాపం 'ఎరుపు' చూస్తే నోట ముద్ద పెట్టలేరు.

మా ఫ్రెండ్ ఒకత్తి నాకు పెళ్ళికాక ముందు, తన మొగుడితో మా ఇంటికొచ్చి ఒకటి రెండు పూటలు వుండిపోతుండేది. ఉంటే వుంది కానీ మా ఇంట్లో మా చేత తన మొగుడికి తెగ మర్యాదలు చేయించేది.

"అత్తయ్యగారూ ఆయనకి ఎనిమిదింటికల్లా టిఫిన్ తినడం అలవాటు. కాఫీలో ఒకసారి కాచిన పాలు ఆయనకి ఇష్టం వుండదు. ఫ్రెష్‌గా మొదటిసారి కాచినపాలు అయితేనే తాగుతారు. మా ఆయనకి బెండకాయ ఫ్రై, గలగలలాడేట్లు చెయ్యండి. నేను ఏం పెట్టినా సర్దుకుంటాను. మా ఆయనకి అన్నం మెత్తనైతే తినరు. మా ఆయన చపాతీ చివర్ల కాలకపోతే తుంపి వదిలేస్తారు. మా ఆయన వెల్లుల్లిపాయలు నూరి వేస్తేనే తింటారు. పాయలు కనపడనీయకండి..మా వారికి పొద్దుటివి ఏవీ వెయ్యకండి. మావారికి వేడి వేడిగా మసిలిపోతుండాలి!" ఇలాగన్నమాట.

పాపం మా అమ్మకి అసలు అల్లుడొచ్చాకా ఈ మురిపాలన్నీ తీరలేదు. మా ఆయన ఏం పెట్టినా, ఎలా పెట్టినా తినేస్తారు అసలు వంక పెట్టాలన్న ధ్యాసలేదు. మా అత్తగారు అలా పెంచారు.

మగాళ్ళకి వంట విషయంలో ఆడవాళ్ళు ఎంత శ్రమపడి, ఎంతసేపు వంటిళ్ళలో మగ్గి చేస్తారో తెలియాలి. కన్నతల్లి అపురూపరాలు పేరిట పిల్లల్ని చెడగొట్టకూడదు. ఆవిడ ముద్దుకి చేసినా, వచ్చిన పెళ్ళాం జీవితాంతం పడాలి కష్టం. ఈ విషయంలో మా నాన్న చాలా ఇబ్బంది పెట్టేవారు. మా బామ్మ మా నాన్నని గారాబంగా పెంచింది. చిన్నప్పుడు 'టీకా' వేసేవాళ్ళు వస్తే దాచి పెట్టి టీకాలే వేయించలేదుట. గర్వంగా చెప్పేది.

పిల్లలందరికీ ఎవరికి వారికే పెరుగు చిన్న చిన్న కటారిలలో తోడు పెట్టేదిట. మా నాన్నకి ఏడాదికి 365 రోజులూ వంకాయ కూరే! "వంకాయ లేకపోతే వాడు తినడు" అనేదట.

ఓసారి మా పిన్ని "బావగారూ ఇంట్లో కంద దుంపా, బంగాళ దుంపలూ వున్నాయి. ఏం వండనూ?" అని అడిగితే, మా నాన్నగారు తడుముకోకుండా "కంద తీసుకెళ్ళి దొడ్లో గొయ్యి తీసి పాతిపెట్టి, బంగాళ దుంపలు వేయించమ్మా" అన్నారట.

అది గొయ్యి తీసి పాతెయ్యకపోతే మళ్ళీ సాయంకాలం ఆ కూర చేస్తుందేమో అని మా నాన్న భయం. ఎవరైనా చారు వేస్తే 'బావిలో పసుపు వేసి తోడితే చారు రెడీ!" అని హేళన చేసేవారు.

తల్లి పిల్లలకి భోజనంలో ఏవేవి తినాలోతో పాటు ఎలా తినాలో కూడా నేర్పాలి. కొందరు కంచం నిండా తోడేసుకుని, అపురూపమైన కూరలూ, పప్పులూ, అన్నంలో కలిపి వదిలేస్తారు.

కొందరు కసాపిసా నమిలి, కంచంలోనే వుమ్మేతారు. కొందరు తింటున్నంత సేపూ వేళ్ళు విదిలించి పక్కన తింటున్న వాళ్ళమీద ఎంగిళ్ళు జల్లుతారు. కంచం చుట్టూ అన్నం, కూరలూ, పచ్చళ్ళూ పోసేస్తారు. కంచాలు ఎత్తేవాళ్ళకి చిరాకుగా. కొంతమంది ఆవగింజా, మెంతిగింజ దగ్గరనుండీ ఏరుతారు. కొంతమంది "అల్లం వేసారా? నూనె ఏది వాడతారూ? అయ్యో.. మినప్పప్పు వేసారా?" అంటూ తింటున్నంత సేపూ గొణుగుతారు.


కొన్ని నియమాలు విచిత్రంగా వుంటాయి. కొంతమంది మారు అడగరు. ఒకసారే ఎక్కువ వెయ్యాలి. వేసినంతా తిని లేచిపోతారు. కొంతమంది ఎడమ చేత్తో తింటారు. అదొక మొక్కు. "అదేవిటీ?" అంటే తినడం ఆపేసి లేచి వెళ్ళిపోతారు.

ఇంక కొత్తగా నా ఫ్రెండ్స్ కొంతమంది 'వేగాన్'లుగా మారుతున్నారు. అంటే జంతువులోంచి వచ్చిన పాలూ, తత్సంబంధమైన పదార్థాలు ఏవీ తినరు. ఉదాహరణకి పాలూ, పెరుగూ, నెయ్యి, వెన్నాలాంటివి అన్నమాట. ఇంక వాళ్ళకి నూనె, డాల్డాలో చేసినవి మాత్రమే పెట్టగలం.

ఇదివరకు మన ఇళ్ళకి అతిధులొస్తే కష్టం సుఖంతో బాటు కలో గంజో పంచుకుని తాగినట్లు వుండేవారు. ఏం పెడితే అది తినేవారు. ఇప్పుడు వాళ్ళ డైట్ ముందే అడిగి తెలుసుకోవాలి.

ఒక ప్రముఖ గాయని మా ఫ్రెండ్ ఇంట్లో అమెరికాలో వుండి రకరకాల పాడులూ, పచ్చళ్ళూ, జావలూ, సంగటీ, అన్నీ రాసి ఇచ్చి ఈ ‘మెనూ‘ కావాలి అందిట. ఆ అమ్మాయికి అవేవీ రాక నేర్చుకోడానికి టైం లేక నానా అవస్థ పడిందట.

కేటరర్స్ పెళ్ళి భోజనాలలో సలాడ్స్, స్ప్రౌట్స్‌తోపాటు ఇప్పుడు సంగటి, బ్రౌన్‌రైస్ చేరుస్తున్నారు. గోధుమ గడ్డీ, బార్లీ నీళ్ళూ డెలికేసీలుట! హా హతవిధీ.. వివాహభోజనంబూ... వింతైన వంటకంబూ.. వహ్వారె గారెలు అల్ల.. అయ్యారె అరిసెలు ఇల్ల.. అని పాడుకునే రోజులు పోయాయి. గడ్డీ గాదం తింటేనే బతుకు.




COMMENTS

